

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.6.36లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందని, సీఎంరిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ చెక్కులను అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, నరేశ్, శ్రీకాంత్, సాయికృష్ణ, శ్రీనివాస్‌గుప్త, ప్రభాకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కోఠి యూపీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ యాకర అమృత

అవగాహనతోనే టీబీ నిర్మూలన

● నల్లకుంట కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే టీబీ వ్యాధి నిర్మూలన సాధ్యమని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. కోఠిలోని యూపీహెచ్‌సీలో జేఏఎస్, జన ఆరోగ్య సమితి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో విస్తృతంగా టీబీ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శివం రోడ్ పక్కన గల నాలాలోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఎస్‌పీహెచ్‌వో కోఠి క్లస్టర్ డా.సాయిబాబా, యూపీహెచ్‌సీ ముషీరాబాద్ వైద్యాధికారి డా.మనోజ్‌రెడ్డి, రత్నానగర్ బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ డా.శ్రీకీర్తన్, లెప్రసీ పారా మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, ధర్మారెడ్డి నల్లకుంట సీఐ జగదీష్, జీహెచ్‌ఎంసీ డీఏ ప్రవీణ్, ఏఈ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

డా.నమ్రత కేసును సీబీఐకి అప్పగించాలి

● జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ

నల్లకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సరోగసి పేరిట కోట్ల రూపాయలు దండుకున్న డా.నమ్రత కేసును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐకి అప్పగించాలని జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డా.నమృత లైసెన్స్ 2021లోనే రద్దు అయినప్పటికీ అక్రమంగా ఈ సెంటర్‌ను నిర్వహిస్తుందని ఆయన ఆరోపించారు. ఆమెపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 10కి పైగా కేసులు ఉన్నాయన్నారు.

మ్యాన్‌హోల్ ఏర్పాటుకు కృషి: విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డినగర్‌లో నూతన మ్యాన్‌హోల్ ఏర్పాటుకు కృషి చేస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం చెన్నారెడ్డినగర్‌లోని డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డ్రైనేజీలో చెత్త వేయకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పీవోడబ్ల్యూ నిరసన ర్యాలీలో పాల్గొన్న అనసూయ తదితరులు

ధర్మస్థల ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి

రాంనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కర్నాటక రాష్ట్రంలోని ధర్మస్థల మంజునాథ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలు, బాలికల శవాలను పాతిపెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు అనసూయ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ధర్మస్థల ఘటనలను నిరసిస్తూ పీవోడబ్ల్యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధర్మస్థల ఆలయ ప్రాంగణంలో పాతిపెట్టిన మహిళల శవాలను వెలికితీసి నిష్పాక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యూ నేతలు ప్రేమలత, భారతి, ఐఎఫ్‌టీయూ నేతలు అరుణ, మల్లక్క, స్వరూప, మంజుల, శివలీల, భవానీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

● ట్రాఫిక్ పోలీసులు

అంబర్‌పేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి మంగళవారం నాంపల్లి ఏటీఎంఎం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ వినూత్నమైన శిక్ష విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిచే ట్రాఫిక్ చౌరస్తాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మద్యం తాగి పట్టుబడిన 5 గురికి రూ.3,300 జరిమానా విధించారు. జడ్జి ఆదేశాల మేరకు అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ చౌరస్తాల వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో శిక్షపడ్డ వారిచే ట్రాఫిక్ పోలీసులు ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు జ్ఞానేశ్వర్, దుర్గాప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

బర్కత్‌పుర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన కుమ్మరి ప్రవీణ్‌కుమార్(23) గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. మహబూబ్‌నగర్‌కు వెళ్లడానికి మంగళవారం ఉదయం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు టికెట్ తీసుకుని స్టేషన్‌లోని రెండవ ప్లాట్ ఫారంకు వెళ్లాడు. సుమారు ఉదయం 6:50 గంటల సమయంలో ప్లాట్ ఫారం అంచున నిలబడి ఉన్న ప్రవీణ్ కుమార్‌ను గూడ్స్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ప్రవీణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.



గంగపుత్ర కాలనీలోని నాగదేవత ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్ భవానీశంకర ఆలయ ప్రాంగణంలో నాగదేవతకు పాలు పోస్తున్న భక్తులు



నాగదేవతకు పాలుపోసి పూజలు నిర్వహిస్తున్న గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

నాగమ్మా.. దీవించమ్మా

ముషీరాబాద్/ చిక్కడపల్లి/ గోల్నాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగుల పంచమిని పురస్కరించుకుని భక్తులు నాగదేవతకు ప్రణమిల్లారు. మంగళవారం వేకువజాము నుంచే భక్తులకు ఆలయాలకు వచ్చి పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీ, చిక్కడపల్లి, వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్‌లో ఉన్న నాగదేవత ఆలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముషీరాబాద్‌లోని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే, భోలక్‌పూర్‌లోని భవాని శంకర ఆలయంలోనూ నాగుల పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ నాయకులు గోరక్‌నాథ్, చంద్రశేఖర్, ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు గోవింద్, బీఆర్‌ఎస్ మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్ పద్మ దంపతులు, వంశీ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.







గంగపుత్రకాలనీలోని నాగదేవత దేవాలయం వద్ద బారులు తీరి పూజలు చేస్తున్న భక్తులు

డివిజన్ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. అశోకానగర్ బస్తీలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. బస్తీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని వారికి ఎమ్మెల్యే హామీనిచ్చారు. అశోకానగర్‌లోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడమే తన లక్ష్యమని ఆయన చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని, కాలనీ వాసులకు ఏ అవసరం వచ్చిన తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం డివిజన్‌లోని ఖాద్రీబాగ్ మజీద్‌ను సందర్శించారు. మజీదుకు కొత్త రిటైనింగ్ వాల్, పెన్సింగ్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



అశోకానగర్ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



అడిక్‌మెట్‌లో చెత్త, మట్టికుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి



డెంగీ వ్యాధిపై కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న అంబర్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వో డా. హేమలత

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు: డీఎంసీలు

రాంనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, ఒకవేళ వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి, అంబర్‌పేట డీఎంసీ మారుతిదివాకర్‌లు హెచ్చరించారు. ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్‌లో మంగళవారం మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లను శుభ్రం చేయడంతో పాటు చెత్త, మట్టికుప్పలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆదేశాల మేరకు మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. విద్యానగర్‌లో ఒకరికి డెంగీ వ్యాధి సోకిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు మందులు అందజేసినట్లు డీఎంసీ రామానుజులరెడ్డి తెలిపారు. హిమాయత్‌నగర్‌లో డెంగీ వ్యాధిపై ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వోలు డా.ప్రవీణ, డా.హేమలత, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలి

● అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ డిమాండ్

నల్లకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల రోస్టర్ పాయింట్లను సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలని అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సూచనలు పాటించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలకు విద్య, ఉద్యోగ రంగాలలో తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణతో రాష్ట్ర ప్రభుత్వం మాలలపై ఎంత వివక్ష చూపుతుందో అర్థమవుతోందని ఆయన ఆరోపించారు. గ్రూప్ 3 లో మాలలతో పాటు మరో 25 కులాలకు అన్యాయం చేసేలా ప్రభుత్వం రూపొందించిన రోస్టర్ విధానాన్ని సవరించాలని తాలుకా రాజేష్ డిమాండ్ చేశారు.

'అర్హుల పెన్షన్లు తొలగిస్తే ఉద్యమిస్తాం'

చిక్కడపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బోగస్ పేరుతో అర్హుల పెన్షన్లు తొలగించాలని చూస్తే ఉద్యమాలు నిర్వహిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) నేతలు వరమ్మ, వెంకట్, అడివయ్య, వెంకటేష్‌లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఫేస్ రికగ్నిషన్ నుంచి అనారోగ్యం, వలసలు వెళ్ళిన వారిని మినహాయించాలని వారు కోరారు.

నేడు వెంకటరమణకు సినారె సాహితీ పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం త్యాగరాయగానసభలో ప్రబంధ సాహిత్య విశ్లేషకుడు బాలాంత్రపు వెంకటరమణకు కిన్నెర- సినారె సాహితీ పురస్కారం అందజేయనున్నట్టు నిర్వాహకుడు మద్దాళి రఘురాం తెలిపారు. సినారె జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డును అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని రఘురాం చెప్పారు.

పరిసరాల శుభ్రత పాటించాలి: పద్మావెంకట్‌రెడ్డి



సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి విద్యార్థులకు సూచించారు. డివిజన్‌లోని వాంబే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై తల్లిదండ్రులకు వివరించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఫీల్డ్ ఆఫీసర్ రాఘవేంద్ర, సిబ్బంది బాబురావు, జ్యోతి, స్వామి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, గోవింద్, అర్జున్, వెంకటరమణరాజు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చిక్కడపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ పీడియాట్రీషియన్ డా. వరప్రసాద్ సూచించారు. మంగళవారం చిక్కడపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లలను తొలుతగా పాఠశాలలో చేర్పించే వయస్సులో అందించాల్సిన డీపీటీ, పోలియో బూస్టర్ టీకాల మోతాదును ఇప్పించే విషయంలో తల్లిదండ్రులు అశ్రద్ధ చేయవద్దని సూచించారు. పిల్లలు సురక్షితంగా ఉండడానికి, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడానికి ఉత్తమ మార్గాల్లో ఇది ఒకటన్నారు.

ఆధునిక యంత్రాలతో సిల్ట్ తీత

మ్యాన్‌హోల్‌లో మానవ రహిత పనులకు దోహదం ● యంత్రానికి అమర్చిన డిస్‌ప్లేతో ముందు జాగ్రత్తలు

ముషీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి సిల్ట్ తీసేందుకు జలమండలి ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మ్యాన్‌హోల్‌లోకి కార్మికులు దిగకుండానే మట్టి, వ్యర్థాలను త్వరితగతిన తొలగిస్తూ సమస్యలను సత్వరం పరిష్కారానికి యంత్రాలు దోహదపడుతున్నాయి. ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ పరిధిలో ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి సిల్ట్ తీసేందుకు ఆధునిక యంత్రాలను కేటాయించనున్నారు. ఇప్పటికే ట్రయల్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.



ఆధునిక యంత్రంతో నాలాలో సిల్ట్ తీస్తున్న కార్మికులు



వాహనానికి అమర్చిన డిస్‌ప్లే ద్వారా నాలా పరిస్థితిని పరిశీలిస్తున్న సిబ్బంది

డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోకి దిగకుండానే సిల్ట్ తొలగింపు

డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి వ్యర్థాలను తొలగించేందుకు ఆధునిక యంత్రాలు ఎంతో దోహదపడుతున్నాయి. మ్యాన్‌హోల్‌పై కవర్ తీయకుండానే మ్యాన్‌హోల్ పరిస్థితిని తెలుసుకునేందుకు ఈ ఆధునిక యంత్రాలు ఉపయోగపడుతున్నాయి. మ్యాన్‌హోల్‌లో ఉండే ఘాటైన రసాయనాల వాయువును గుర్తించడం, మ్యాన్‌హోల్ డెప్త్, అందులో ఉన్న వ్యర్థాలను పరిశీలించేందుకు వాహనానికి ప్రత్యేకంగా డిస్‌ప్లేను కూడా ఏర్పాటు చేశారు. తద్వారా ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా సజావుగా విధులు నిర్వహించేందుకు ఈ యంత్రం సహకరిస్తుంది. కార్మికులకు ఎలాంటి నష్టం, ప్రయాస లేకుండా నాలాలోని సిల్ట్‌ను తీసి వాహనంలోనే వేసే విధంగా వీలుంటుంది. పెద్ద వాహనానికి నలుగురు కార్మికులు, చిన్నవాహనానికి ఇద్దరు కార్మికులను నియమించారు. వాహనానికి అమర్చిన డిస్‌ప్లేను పరిశీలించేందుకు మరోవ్యక్తిని నియమించడంతో ప్రతి రోజు 10 నుంచి 12 ఫిర్యాదు లను పూర్తి చేసి సమస్యను పరిష్కరించేందుకు వాహనాలు దోహదపడనున్నాయి

ఫిర్యాదులు తగ్గుతాయి



గతంలో మ్యాన్‌హోల్‌లోని నుంచి సిల్ట్ తీసేందుకు ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం ఆధునిక యంత్రాల వల్ల ఎప్పటికప్పుడు తమకు అందిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం. ఎమర్జెన్సీ పనులు నిర్వహించేందుకు ఈ వాహనాలు ఎంతో దోహదపడనున్నాయి. ఈ ఆధునిక టెక్నాలజీ వాహనాల పనితీరును పరిశీలిస్తున్నాం.

- మోహన్‌రాజ్, జలమండలి డీజీఎం

నకిలీ డీమార్ట్ యాప్‌తో మోసం

● వృద్ధురాలి నుంచి రూ.1.17 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ డీ మార్ట్ యాప్ పేరుతో మోసపూరిత ప్రకటన చేసి, నగరానికి చెందిన ఓ వృద్ధురాలి నుంచి రూ.1.17లక్షలను సైబర్ నేరగాడు కాజేశాడు. మంగళవారం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నల్లకుంటకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు ఆన్‌లైన్‌లో స్టెప్ కౌంటర్ యాడ్‌లో ప్రమోట్ చేసిన నకిలీ డీమార్ట్ యాప్‌కు ఆకర్షితురాలైంది. ఆ ప్రకటనలో డీమార్ట్ రెడీ యాప్ కిరాణా సామగ్రిపై డిస్కౌంట్‌లు అందిస్తున్నారన్న ప్రచారాన్ని నమ్మింది. తన ఫోన్‌లో నకిలీ మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంది. అందులో కొనుగోలు చేసేందుకు వ్యక్తిగత, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేసి, రూ.298ల విలువ చేసే వస్తువులను ఆర్డర్ చేసింది. ఆ తర్వాత ఆమె బ్యాంకు ఖాతా నుంచి వరుసగా మూడు సార్లు రూ.44,838, రూ.43,998, రూ.28,685లను బదిలీ అయినట్లు గుర్తించింది. వెంటనే ఆమె యాక్సిస్ బ్యాంకుకు సమాచారం అందించి కార్డును బ్లాక్ చేయాలని కోరింది. ఆ తర్వాత జూన్ 19న వచ్చిన క్రెడిట్ కార్డు స్టేట్‌మెంట్‌లో మొత్తం రూ.1,17,521లు బదిలీ అయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ యాప్‌లో ఆర్డర్ ఇవ్వడం వల్లే సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతాను డబ్బులను కాజేశారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.